సాక్షి
వికారాబాద్

మంగళవారం : 29 : ఏప్రిల్ : 2025



ఉపాధిలో పండ్లతోటలు!

ఉపాధి హామీ పథకంలో భాగంగా దౌల్తాబాద్ పరిధిలో 80 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని నిర్ణయించారు. 8లో▸



కల్లాల్లేక..

సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో కల్లాలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. 8లో▸



బోసిపోతున్న చెరువులు

కొడంగల్ నియోజకవర్గంలోని నోటిఫైడ్ చెరువులు కుంటలకు మరమ్మతులు లేక బోసిపోయాయి. 9లో▸

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో డ్రా

అనంతగిరి: కొడంగల్ మున్సిపల్ పరిధిలో బార్ లైసెన్స్ జారీ చేసేందుకు మంగళవారం ఉదయం 11గంటలకు కలెక్టర్ సమక్షంలో డ్రా నిర్వహించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు, లేదా వారి నుంచి పవర్ ఆఫ్ అటార్నీ పొందిన వ్యక్తులు తప్పనిసరిగా ఉదయం 10 గంటలకు ఎంట్రీ పాస్‌తో హాజరుకావాలని సూచించారు.

రేపు పూలే, అంబేడ్కర్ జన జాతర

యాలాల: తాండూరు పట్టణంలో ఈ నెల 30న నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జన జాతర సభను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుల వివక్షకు వ్యతిరేకంగా కేవీపీఎస్ కొన్నేళ్లుగా పూలే, అంబేడ్కర్ జన జాతర సభలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో కులవివక్ష, అంటరానితనం, ఎక్కడ ఉన్న ప్రతిఘటించి పోరాడేందుకు ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నర్సింలు, ఉమేశ్, బాలప్ప, కృష్ణ, కిష్టప్పగౌడ్, రాములుగౌడ్, రఫీక్, రజాక్, రమేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు

అనంతగిరి: వికారాబాద్‌లోని రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ(గవర్నమెంట్ రైల్వే పోలీసు) పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే పరిసరాలను, ప్రయాణికుల బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. విధి నిర్వహణలో భాగంగానే ఈ తనిఖీలు నిర్వహించామని, ప్రయాణికుల భద్రతే తమ ధ్యేయమని ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ జిల్లా కార్యదర్శి పెంటయ్య గుప్తా

దోమ: బీజేపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శులు వేముల పెంటయ్య గుప్తా, మేకల యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐనాపూర్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టత, స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ బలోపేతమవుతోందని కార్యకర్తలు సైతం శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. రాబోవు రోజుల్లో పార్టీలో అందరికి సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సీత్యాబాల్‌రాజ్, ఐనాపూర్ మాజీ ఉపసర్పంచ్ బుగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలు వినియోగించుకోవాలి

తాండూరు సబ్ డివిజన్ ఆఫీసర్ రాకేశ్‌రెడ్డి



లింగంపల్లిలో సబ్ పోస్టాఫీస్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

కుల్కచర్ల: ప్రజలు పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తాండూరు సబ్ డివిజన్ ఆఫీసర్ రాకేష్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని లింగంపల్లిలో నూతనంగా బ్రాంచ్ పోస్టాఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాలాశాఖ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందించేందుకు శాఖాపరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పోస్టాఫీస్‌లలో వాణిజ్యపరమైన సేవలు సైతం ప్రారంభించామని.. ఇన్సూరెన్స్, భీమా వంటి స్కీంలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి రాధ, సబ్ పోస్ట్ మాస్టర్ సాయి, రమేష్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కొందరికే 'భరోసా'

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన రైతు భరోసా పథకం సగంమంది రైతులకే సంతోషాన్నిచ్చింది. నాలుగు ఎకరాలు ఉన్న రైతుల ఖాతాల్లోకి మాత్రమే పెట్టుబడి సాయం అందింది. వానాకాలం సమీపిస్తున్నా నేటికీ ఇంకా 40 శాతం భూమికి సాగు సాయం అందక ఎదురు చూపులు తప్పడం లేదు.

నేటికీ 3.54 లక్షల ఎకరాలకే పెట్టుబడి సాయం



పెండింగ్‌లో మరో రెండున్నర లక్షల ఎకరాలు

- నాలుగు ఎకరాల వరకు ఉన్న రైతు ఖాతాల్లో నగదు జమ
- పథకం ప్రారంభించి మూడు నెలలు గడిచినా పూర్తవని ప్రక్రియ

వికారాబాద్: రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాగా ఆ సంతోషం సగం మంది వద్దే ఆగిపోయింది. గతేడాదికి సంబంధించి పెట్టుబడి సాయం అందించడం ప్రారంభించి మూడు నెలలు గడుస్తున్నా 60 శాతం భూమికే సాగు సాయం అందింది. మరో 40 శాతం భూమికి సంబంధించి పెండింగ్‌లోనే ఉన్నాయి. వానాకాలం పంటలు సమీపిస్తున్నా వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. జనవరి 26న రైతు భరోసా పథకాన్ని ప్రారంభించి మరుసటి రోజు మండలానికి ఓ గ్రామం చొప్పున పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి 20 గ్రామాల రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. అనంతరం వారం తర్వాత ఒక ఎకరం, నెల రోజుల తర్వాత ఒక్కో ఎకరా పెంచుతూ ఇప్పటి వరకు నాలుగు ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల ఖాతాలకు భరోసా డబ్బు జమ చేశారు.

పెండింగ్‌లో రూ.120 కోట్లు

జిల్లాలో ఉన్న సాగు భూమిలో ఇప్పటి వరకు 60 శాతం భూములకు మాత్రమే రైతు బరోసా డబ్బులు జమ అయ్యాయి. మరో 40 శాతం భూమికి ఇంకా డబ్బులు జమ కావాల్సి ఉంది. 3,12,872 మంది రైతులు పథకానికి అర్హులుండగా వారికి 6,03,500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వీరిలో నాలుగు ఎకరాల వరకు భూమి కలిగిన రైతులు 2,26,253 మంది ఉన్నారు. వీరికి ఎకరాకు రూ.6 వేల చొప్పున రూ.212.52 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. మరో 2.5 లక్షల మంది రైతులకు రూ.149.57 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కాగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు 2,69,293 మంది రైతులకు సంబంధించి రూ.332.76 కోట్లు బిల్లులు రెడీ చేసి ట్రెజరీకి పంపించారు. బిల్లులు చేసి ట్రెజరీకి పంపిన మరో రూ.120 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ముంచుకొస్తున్న వానాకాలం సీజన్

రైతుకు పెట్టుబడి సాయం అందించేందుకు గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఈ పథకాన్ని అమలు చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసాగా అమలు చేస్తోంది. అయితే ప్రభుత్వం ఏదయినా రైతులు పంటలు సాగు చేసే సమయంలో పెట్టుబడులకు మాత్రం అందివ్వడం లేదు. ఏడాది కాలం సాగు సాయం ఇవ్వని సర్కారు పంటలు ఇళ్లకు వచ్చాక సాగు సాయం అందిస్తుండడం సైతం రైతులను అసంతృప్తికి గురిచేస్తోంది. అయితే పథకం ప్రారంభించాక కూడా ఒక్కో ఎకరం చొప్పున డబ్బులు ఖాతాల్లో జమ చేస్తూ వస్తుంది. ఎకరం దాటి మరో ఎకరానికి డబ్బులు జమ చేసేందుకు మొదట్లో వారం రోజుల సమయం పట్టగా ఇప్పుడు నెల రోజులు పడుతోంది. పథకం ప్రారంభమై మూడు నెలలు గడిచినా నాలుగు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు మాత్రమే సాగు సాయం అందింది. ఈ లెక్కన పదెకరాల ఆపైన సాగు భూమి కలిగిన రైతులకు రైతు భరోసా డబ్బులు అందటానికి మరో రెండు మూడు నెలల పడుతుందా..? అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే కొంచం అటూ ఇటూగా మళ్లీ వర్షాకాలంలో ఖరీఫ్ విత్తనాలు ప్రారంభించే నాటికి కూడా మొదటి విడత రైతు భరోసా పూర్తవుతుందో లేదో అనే అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎదురుచూపులే మిగిలాయి



తమకు 6.17 ఎకరాల పొలం ఉంది. ప్రభుత్వం నుంచి రైతు భరోసా నగదు అందలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి ఎదురుచూపులు తప్పడం లేదు. ఇతర రైతులకు నగదు జమ అయి న ప్రతీసారి బ్యాంకుకు వెళ్లి చెక్ చేసుకుని వస్తున్నా. ఇంకా రాలేదనే చెబుతున్నారు. సాగుకు సాయం అందక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం సకాలంలో నగదు జమ చేసి రైతులను ఆదుకోవాలి.

– గొల్ల అంజయ్య, రాంపూర్, మర్పల్లి మండలం

ట్రెజరీకీ పంపించాం



జిల్లాలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా రైతులకు ఖాతాల్లో రూ.రెండు వందల కోట్లకు పైగా రైతు భరోసా డబ్బులు జమ అయ్యాయి. మరో రూ.120 కోట్లకు సంబంధించి బిల్లులు చేసి ట్రెజరీకి పంపించాం. వారి ఖాతాల్లోనూ త్వరలో నగదు జమ అవుతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి



పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

మందుల కొరత ఉంటే చెప్పండి

- వెంటనే పంపించేందుకు చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ ప్రతీక్ జైన్

తాండూరు: ఆస్పత్రిలో మందుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పంపించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ వైద్యులకు చెప్పారు. సోమవారం ఆయన పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషెంట్, ల్యాబ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూమ్‌తో పాటు ఔట్ పేషంట్, ఏఎంసీ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం భవనానికి మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో వైద్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. బాలింతలకు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పెద్దేముల్ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యులు శ్వేత, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఇంటర్ ఫలితాలపై నోడల్ అధికారి శంకర్ సమీక్ష



ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమైన శంకర్

అనంతగిరి: సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా వారికి దిశానిర్దేశం చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి ఎస్.శంకర్ అన్నారు. సోమవారం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష ఫలితాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతీ సబ్జెక్టులో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదునివ్వాలని చెప్పారు. ఈ నెల 30లోగా పరీక్ష ఫీజు చెల్లించేలా ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజు చెల్లించేదుకు గడువు పెంపు ఉండదని స్పష్టం చేశారు. గతేడాదితో పోలిస్తే కొంత మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. మార్చి పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం కళాశాలల వారీగా ఫలితాలను సమీక్షించారు. కళాశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి ప్రిన్సిపాళ్లు, ఉపన్యాసకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి, కుమారస్వామి, సురేశ్వరస్వామి, వెంకటేశ్వరరావు, నర్సింలు, తాండూర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లినాథప్ప, ఉపన్యాసకులు రాములు రఘువీర్ దాస్, కార్యాలయ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.



ముజీబ్‌ఖాన్‌కు రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, చిత్రంలో పీఎంఆర్, బీఎంఆర్, ప్రజాకవి జయరాజ్, సబ్-కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

బడుగుల సూర్యుడు అంబేడ్కర్

- ఆయన రచించిన రాజ్యాంగంతోనే సుపరిపాలన
- శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

తాండూరు: దళిత, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు నింపిన సూర్యుడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ప్రజాకవి జయరాజ్, విగ్రహదాత ముజీబ్ ఖాన్ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కందనెల్లి గ్రామస్తులు ఏకతాటిపైకి రావడం అభినందనీయమన్నారు. రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తి ముజీబ్‌ఖాన్ విగ్రహ ఏర్పాటుకు సహకరించడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ అన్ని వర్గాలకు సమన్యాయం కల్పించేందుకు రాజ్యాంగం నిర్మించారని చెప్పారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు.. పార్లమెంట్ నుంచి పంచాయతీల వరకు పరిపాలన సాఫీగా సాగడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నారని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ.40వేల కోట్ల బడ్జెట్ కేటాయించారని గుర్తు చేశారు.

కందనెల్లిలో మహనీయుల విగ్రహాలు

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ..కందనెల్లిలో త్వరలో మహాత్మాగాంధీ, బాబు జగ్జీవన్‌రాం లాంటి మహనీయుల విగ్రహాల ను ఏర్పాటు చేస్తామన్నారు. యువత వారి మార్గంలో నడవాలన్నారు. అంబేడ్కర్ కలలను సీఎం రేవంత్ రెడ్డి సాకారం చేస్తున్నారని కొనియాడారు.

కులగణన చేపట్టిన ఏకైక రాష్ట్రం

అనంతరం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో కులగణన చేపట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం సర్వే చేయించారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదింప చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, ప్రభాకర్‌గౌడ్, అంబేడ్కర్ అసోషియేషన్ సభ్యులు, యువజన సంఘం సభ్యులు తదితరులున్నారు.

నేటి నుంచి బాబూజీ మహరాజ్ జయంత్యుత్సవాలు



నందిగామ: కన్హా శాంతి వనంలో మంగళవారం నుంచి మే 1వ తేదీ వరకు బాబూజీ మహరాజ్ 125వ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పీఆర్‌ఓ చంద్రారెడ్డి తెలిపారు. భారతీయ సాంస్కృతిక శాఖ సహకారంతో హార్ట్ ఫుల్‌నెస్ గ్లోబల్‌గైడ్ కమ్లేష్ డి.పటేల్(దాజీ) ఆధ్వర్యంలో వేడుకలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అభ్యాసీలకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు.

'ధరణి'తో దగా



ధారూరు: ఎద్దుల బండిపై ఊరేగింపుగా సమావేశానికి వెళ్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

- రైతుకు మేలు చేకూర్చేందుకే 'భూ భారతి'
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ధారూరు: ధరణి పేరిట గత ప్రభుత్వం రైతాంగాన్ని దగా చేసిందని.. ఆ చిక్కులను పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూ భారతిని తీసుకువచ్చారని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన స్పీకర్‌ను కాంగ్రెస్ నాయకులు ఎద్దుల బండిపై ఊరేగింపుగా రైతువేదికకు తీసుకువచ్చారు. అనంతరం స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంతో రైతులకు మేలు చేకూరుతుందన్నారు. రజతోత్సవం పేరిట మాజీ ముఖ్యమంత్రి వచ్చి అబద్ధాలు మాట్లాడరని.. ఆయన మాటలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం రూ.54 వేల కోట్లు ఖర్చు చేసిందని.. 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్లు రుణ మాఫీ చేసిందని గుర్తు చేశారు. అనంతరం 155 మంది లబ్ధిదారులకు ఉద్యాన శాఖ ద్వారా మంజూరు అయిన సబ్సిడీ స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ఆర్డీ వాసుచంద్ర, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. ధారూరు మండల కేంద్రం, మోమిన్‌ఖుర్దు, మోమిన్‌కలాన్లో సీసీ రోడ్లను. అనంతరం నాగసాన్‌పల్లి రైల్వే గేట్ సమీపంలో రూ.1.40 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి, సీసీ రోడ్లను ప్రారంభించారు.

రైతుల శ్రేయస్సుకే 'భూ భారతి'

బంట్వారం: రైతుల శ్రేయస్సు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం కోట్‌పల్లి మండల పరిధిలోని బుగ్గాపూర్ ఫంక్షన్‌హాల్‌లో భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. కొత్త చట్టంతో వారసత్వ, ప్రభుత్వ, అటవీ, సాగునీటి శాఖ, అసైండ్ భూమి, దేవాదాయ శాఖ భూముల వివరాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు. చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు భూముల విషయంలో జవాబుదారీతనాన్ని పెంచుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి అధికారులకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. కోర్టులను ఆశ్రయించకుండా భూ సమ్యలను పరిష్కరించే వెసులుబాటు భూ భారతి చట్టంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, వికారాబాద్ ఆర్డీఓ వాసు చంద్ర,కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవలు సులభతరం

తాండూరు: భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంతో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. కొత్త చట్టంతో రిజిస్ట్రేషన్, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్ మార్పులు, చేర్పులు, సాదాబైనామాలు తదితర సేవలు సులభతరం అవుతాయన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూ భారతి చట్టంలో రైతుల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరించేలా రూపొందించారన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీ నుంచి భూ భారతి చట్టం అమలు చేసేందుకు భూ భారతి పోర్టల్ తీసుకొస్తున్నామన్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ రైతుల ప్రశ్నలకు జవాబులిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, నాయకులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత

- ఉమెన్ పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లోని మహిళా పీఎస్‌ను సోమవారం ఎస్పీ నారాయణరెడ్డి సందర్శించారు. ముందుగా ఆయన స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఠాణాకు వచ్చిన ఫిర్యాదుదారులతో నేరు గా మాట్లాడారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మహిళల భద్రతకు ప్రభుత్వం అధి క ప్రాధాన్యత ఇస్తుందని.. మహిళా పీఎస్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి బాధితులకు న్యాయం చేయడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. స్టేషన్ సీఐ, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ శివచంద్ర, ఉమెన్ ఎస్‌ఐలు రాణి, స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొలగిన మురుగు



మురుగు తొలగించిన పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో ఎట్టకేలకు పారిశుద్ధ్య పనులు సోమవారం చేపట్టారు. కొంత కాలంగా పరిశుభ్రత లోపించడంతో గ్రామంలో రోడ్ల వెంబడి మురుగు పారడంతో దుర్గంధం వ్యాపించింది. అలాగే గ్రామం నుంచి చెరువుకు వెళ్లే దారిలో కంపచెట్లు పెరిగిపోయిన వార్త సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా మురుగు, కంప చెట్లను తొలగించారు.

గుంతలో ఇరుక్కున్న లారీ

రాకపోకలకు తీవ్ర అంతరాయం



గుంతలో ఇరుక్కున్న నాపరాతి లోడ్ లారీ

తాండూరు టౌన్: తాగునీటి పైపులైన్ లీకేజీ మరమ్మతు కోసం తవ్వి పూడ్చిన గుంతలో ఓ లారీ సోమవారం దిగబడింది. దీంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో తాగునీటి పైపులైన్ లీకేజీ కావడంతో మున్సిపల్ సిబ్బంది గుంత తవ్వి మరమ్మతు చేసిన అనంతరం పూడ్చేశారు. అయితే గుంతను సరిగా పూడ్చక పోవడంతో అటుగా వెళ్తున్న నాపరాతి లోడ్ లారీ దిగబడింది. చివరికి క్రేన్ సహాయంతో పోలీసులు బయటకు తీశారు. తవ్విన గుంతను సరిగా పూడ్చకపోవడంతోనే లారీ దిగబడిందని డ్రైవర్ అసహనం వ్యక్తం చేశాడు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



ఘటనా స్థలంలో స్థానికులు

పరిగి: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఒకరికి స్వల్ప గాయాలైన సంఘటన పట్టణ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు ఎక్కించుకుని బస్టాండ్ నుంచి మహబూబ్‌నగర్‌కు బయలు దేరింది. కాసేపటికే బస్టాండ్ ముందు ఓ ప్రయాణికురాలు బస్సును ఆపడంతో డ్రైవర్ నిలబెట్టాడు. దీంతో వెనుకనే వస్తున్న లారీ ఢీకొట్టింది. వెనకాల టికెట్లు తీసుకుంటున్న కండక్టర్ రాములుకు స్వల్ప గాయాలయ్యాయి. కండక్టర్‌ను చికిత్స నిమిత్తం పరిగి ఆస్పత్రికి తరలించి, లారీపై కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీలు



ఓ సూపర్ మార్కెట్‌లో జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు దుకాణాలు, హోటళ్లను సోమవారం మున్సిపల్ శానిటేషన్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా తినుబండారాలను పరిశీలించడంలో హోటళ్లలో పరిశుభ్రతను పరిశీలించారు. నిబంధనలు పాటించని పలు హోటళ్లకు జరిమానా విధించామని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాల్‌మెంట్ ఏఈ శీను, పలువురు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మీర్‌పేట: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం ఓ వ్యక్తి(60) బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఎస్ఎల్ఎన్ఎస్ కమాన్ వద్ద మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, కొంత కాలంగా ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించామని, తెలిసిన వారు ఉంటే మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

నేరాలను నియంత్రించాలి

కొందుర్గు: నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రవీందర్‌నాయక్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవి సెలవులు ఉన్న కారణంగా కొందరు దూర ప్రాంతాలకు వెళ్తుంటారని, ఈ క్రమంలో ఇంటి వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటికి అలారం సిస్టమ్, సీసీ కెమెరాలు అమర్చుకోవాలని తెలిపారు.

ఉపాధిలో పండ్లతోటలు!

- మండలంలో 80 ఎకరాల్లో పెంపకమే లక్ష్యం
- రైతులు ముందుకు రావాలని అధికారుల సూచన



దౌల్తాబాద్ శివారులోని ఓ మామిడితోట

దౌల్తాబాద్: కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు ఎన్ఆర్‌జీఎస్ కింద ఉద్యానవనాలు విరివిగా పెంచేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద మండలంలో పండ్ల తోటలు 80 ఎకరాల్లో పెంచాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఏప్రిల్ 1 నుంచి మండల కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వానాకాలం పంటలు ముగిసినందున ఎవరైనా ఆసక్తి కలిగిన సన్న, చిన్న కారు రైతులు ఉద్యాన పంటలు సాగు చేసేందుకు ముందుకు వస్తే వారికి అన్ని రకాల ప్రోత్సాహం అందించనున్నారు.

పరికరాలపై రాయితీ

ఉద్యానవన పంటల సాగులో మామిడి, బత్తాయి, నారింజ, జామ, సీతాఫలం, యాపిల్, బెర్రీ, కొబ్బరి, దానిమ్మ, మునగ, చింత, ఆయిల్‌పామ్ వంటివి రైతులు తమ భూముల పరిస్థితికి అనుగుణంగా ఎంపిక చేసుకోవచ్చు. ఏదైనా ఒకే రకం సాగు చేసుకోవాల్సి ఉండగా దానికి మాత్రమే నిర్ణీత ధరలు చెల్లిస్తారు. రైతులు మొక్కలు తమకు నచ్చిన నర్సరీల్లో ఎంపిక చేసుకోవచ్చని లేని ఎడల ప్రభుత్వం ఎంపిక చేసిన నర్సరీల నుంచి తెచ్చుకోవచ్చు. రైతులు స్వయంగా కొనుగోలు చేస్తే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తారు. పండ్ల తోటల పెంపకం వైపు వెళ్లే రైతులు ఉద్యానవన అధికారులను సంప్రదించి వారి పర్యవేక్షణలో చేపట్టాలి. ముందస్తుగా బిందు సేద్యానికి దరఖాస్తు చేసుకుంటే 90 శాతం రాయితీపై పరికరాలు అందిస్తారు.

కావాల్సిన ధ్రువపత్రాలు

సన్న, చిన్నకారు రైతు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండి పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సులను ఇవ్వాలి. వ్యవసాయ పొలాల వద్ద నీటి వసతి కలిగి ఉండాలి. ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేస్తే అధికారులు పరిశీలించి ఉద్యానవనాలు మంజూరు చేస్తారు. మంజూరైన రైతులకు మొక్కలకు నిధులతో పాటు గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి పనులు ఉపాధిహామీ కిందనే చేపడుతున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యాన పంటల సాగుతో రైతులు మెరుగైన లాభాలు పొందవచ్చు. ఈ ఏడాది 80 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి టార్గెట్ ఉంది. దీనికి అన్నదాతలు ముందుకు రావాలి.

– అంజిలయ్య, ఏపీఓ, దౌల్తాబాద్

సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తాండూరు టౌన్: దేశ వ్యాప్తంగా మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం తాండూరులో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల చర్యలను అమలు చేస్తోందన్నారు. కేంద్రం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాసేందుకు యత్నిస్తోందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసంఘటితరంగ, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు మే 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే మే 1వ తేదీన అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీసీఐ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప, కార్మికులు మాణిక్యం, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కల్లాల్లేక.. తడిసి మోపెడు



దౌల్తాబాద్‌లో కిరాయికి తెచ్చిన పరదాపై రైతులు ఆరబోసిన ధాన్యం

దౌల్తాబాద్: ఐకేపీ, కోఆపరేటివ్ సహకార సంఘాల ఆధ్వర్యంలో మండలంలో ఏటా ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కల్లాలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. కేంద్రాలకు శాశ్వత స్థలాల్లేక అధికార యంత్రాంగం కల్లాల నిర్మాణాలపై శ్రద్ధ చూపడంలేదని రైతులు చెబుతున్నారు. కేంద్రాలు ఏర్పాటు చేసిన స్థలాల్లో తెచ్చి పోసిన ధాన్యం మట్టిలో కలిసి నష్టపోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలో ఏళ్ల క్రితం నుంచి ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా వాటికి శాశ్వత స్థలాలు గుర్తించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతుంది. ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లో ఐకేపీ, కోఆపరేటివ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం విక్రయానికి ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు ప్రయోజనమున్నా వసతుల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారు. ధాన్యం మట్టిలో కలుస్తుందని రైతులు పరదాలు కిరాయికి తెచ్చుకుంటున్నారు. పరదాల అద్దె తడిసి మోపడవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను కేటాయించి కల్లాలు నిర్మించాలని వేడుకుంటున్నారు.

సాగర్‌రోడ్డుపై ఉద్రిక్తత



ఆందోళకారులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

- హోంగార్డ్ కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువుల ధర్నా
- ఇరువైపులా ట్రాఫిక్ జాం
- ఇబ్రహీంపట్నం ఏసీపీ చొరవతో శాంతించిన ఆందోళనకారులు

యాచారం: మండలంలోని గునుగల్ గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. డ్రైనేజీ కాల్వ నిర్మాణం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి గ్రామానికి చెందిన హోంగార్డ్ మేడిపల్లి వెంకటేశ్ ఛాతిలో నొప్పితో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే ఊరికి చెందిన ప్రశాంత్, పవన్‌ల కుటుంబ సభ్యులు కొట్టడంతోనే హోంగార్డ్ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు బాధితులు ఆరోపించారు. తమని ఆదుకోవాలని సోమవారం సాయంత్రం గునుగల్ గేట్ వద్ద సాగర్‌రోడ్డుపై మృతుడి భార్య స్వాతి, పిల్లలు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వందలాది మంది రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సాగర్ రహదారి ఇరువైపులా భారీగా ట్రాఫిక్‌జాం అయింది. సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని, ఘర్షణ పడిన వారిని అదుపులోకి తీసుకున్నామని తెలియజేశారు. అయినా ఆందోళనకారులు వినకపోవడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మరోవైపు మృతుడి బంధువులు ఉదయం ప్రశాంత్, పవన్‌ల ఇళ్లల్లోని వస్తువులకు నిప్పు పెట్టే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో గ్రామంలో పోలీసుల పహారా ఏర్పాటు చేశారు.

కొడంగల్-తిరుపతికి బస్సు సౌకర్యం కల్పించండి

కొడంగల్: కొడంగల్ నుంచి తిరుపతికి బస్సులు నడపాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పవిత్ర పుణ్య క్షేత్రాలైన తిరుపతి, షిర్డీ, యాదగిరిగుట్ట, బాసర, శ్రీశైలం, మంత్రాలయం, వేములవాడ, మహానంది తదితర ప్రాంతాలకు నెలకోసారైనా రవాణా సౌకర్యం కల్పించాలని విన్నవిస్తున్నారు. తిరుపతి పుణ్యక్షేత్రానికి నెలలో ఒకసారి పౌర్ణమికి ఒక రోజు ముందు, ప్రతి నెల 6వ తేదీన బస్సులు నడిపిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని కోరుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్‌తో బస్సులు నడిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం వాల్ పోస్టర్‌ను సోమవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 7న నిర్వహించనున్నారు. వికారాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సోమవారం రాత్రి గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు.

అనుమతి లేని డబ్బాల తొలగింపు



ఆస్పత్రి వద్ద గుమిగూడిన అధికారులు, స్థానికులు

యాలాల: తాండూరు–హైదరాబాద్ మార్గంలో ఉన్న మాతాశిశు ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఉన్న డబ్బాలను యాలాల రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. మాతా శిశు ఆస్పత్రి ప్రహరీని ఆనుకొని కొందరు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. కాగా ఆస్పత్రిలో హోటల్ టెండరు దక్కించుకున్న వారు డబ్బాల విషయమై ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ అంజయ్య, ఆర్ఐలు శివచరణ్, వేణు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఎలాంటి అనుమతి లేకుండా డబ్బాలను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. దీనికితోడు ఆస్పత్రి సమీపంలో బస్టాప్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సైతం ఉండటంతో డబ్బాలను తొలగించేందుకు నిర్ణయించారు. జేసీబీ సాయంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తొలగించారు. కాగా డబ్బాల తొలగింపు సమయంలో కొందరూ అధికారులతో వాదనకు దిగారు. యాలాల ఎస్ఐ గిరి తన సిబ్బందితో ఆస్పత్రి వద్ద ఎలాంటి గొడవ జరగకుండా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డబ్బాలను పూర్తిగా తొలగించినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు ఎన్నికలు



నూతన అధ్యక్ష, కార్యవర్గ సభ్యులతో అధికార పార్టీల నేతలు

ఏకపక్షంగా నిర్వహించారని ప్రతిపక్షాల ఆరోపణ

దోమ: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డీపీఎం వీరయ్యతో కలిసి ఏపీఎం సురేశ్ సోమవారం 19వ వార్షిక మహాసభ సమావేశం నిర్వహించారు. మొత్తం మండలంలో 48 గ్రామ సంఘాలున్నాయి. అందులో 39 గ్రామ సంఘాల అధ్యక్షులు ఎన్నికలకు హాజరు కాగా, వాటిలో వాటాధనం, సభ్యత్వం కట్టని 8 గ్రామ సంఘాల అధ్యక్షులు ఎన్నికలకు అనర్హులయ్యారు. మిగతా ఓ గ్రామ సంఘం సభ్యురాలు రాలేకపోయారు. అనంతరం 12 మంది గ్రామ సంఘాల సభ్యులను ఎగ్జిక్యూటివ్(ఈసీ) మెంబర్లుగా ఏకగ్రీవంగా తీసుకున్నారు. వారిలో అధ్యక్షురాలుగా దాదాపూర్ గ్రామానికి చెందిన ఇడిగి అనసూజ, కార్యదర్శిగా మైలారం గ్రామానికి చెందిన శ్రీలత, కోశాధికారిగా దోర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మిని ఎంపీడీఓ గ్యామాతో కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సంఘాల సభ్యులకు జరిగిన ఈ ఎన్నికల్లో ఏపీఎం సురేశ్ కేవలం అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు మాత్రమే సమాచారం అందించారని ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

అనంతగిరి: ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు సోమవారం గోధుమగూడ గ్రామంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టారు. వీధుల గుండా ర్యాలీ నిర్వహించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో రాజ్యాంగాన్ని రచించారన్నారు. కాగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఈ ఆగడాలను మనం అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు గ్రామగ్రామన రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుకారం, మల్లేశం, శివయ్య, జనార్దన్‌రెడ్డి, రమేశ్ నాయక్, మనోహర్‌గౌడ్, రవీందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్ఓ సంగీత అధికారులు

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- ప్రజావాణికి 51 ఫిర్యాదులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా.. సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 51 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండలాల తహసీల్దార్లు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



కొడిచర్ల చెరువు



ఈత కోసం వెళ్లి మునిగి మృతి చెందిన విద్యార్థులు (ఫైల్)

సెలవుల సమయం.. పిల్లలు భద్రం

చిన్నారులను ఓ కంట కనిపెట్టాలి

- చెరువులు, బావుల వద్దకు వెళ్లకుండా చూడాలి

కొత్తూరు: ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కొనసాగుతున్నాయి. చదువు కోసం హాస్టళ్లు, పట్టణాల్లో ఉండే విద్యార్థులు తమ సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. వారు చదువుకునే సమయాల్లో ఆటలపై సరిగ్గా దృష్టి పెట్టలేదు. దీంతో ఇంటికి చేరుకున్న విద్యార్థులు మండుటెండలో సైతం క్రికెట్‌తో పాటు పలు క్రీడలు ఆడుతున్నారు. మరికొందరు గ్రామాలకు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఉన్న చెరువులు, కొలనుల్లో ఈత కోసం వెళ్తున్నారు. సరైన జాగ్రత్తలు, పర్యవేక్షణ కొరవడితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. మండలంలోని పలు చెరువుల్లోని గుంతల్లో అభం శుభం తెలియని చిన్నారులు సెలవుల్లో ఈత కోసం వెళ్లి మృత్యువాత పడిన ఘటనలు చాలా ఉన్నాయి.

పర్యవేక్షణ తప్పనిసరి

- వేసవి సెలవుల కోసం ఇళ్లకు చేరుకున్న తమ పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతుండాలి. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆటలు ఆడకుండా చూడాలి.
- విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పకుండా గ్రామాల సమీపంలోని చెరువులు, కుంటల్లోకి ఈత కోసం వెళ్తుంటారు. దీంతో పిల్లలకు చెరువుల్లో ఉన్న లోతు గుంతల గురించి తెలియజేయాలి.
- ఈత కొలనులు, చెరువుల్లో ఈత నేర్చుకునే చిన్నారులను తల్లిదండ్రులు వెంట తీసుకెళ్లాలి.
- సాయంత్రం 5 గంటల తర్వాతనే బయట ఆడుకునే విధంగా అవగాహన కల్పించాలి.
- ఎండ కారణంగా వడదెబ్బకు గురైతే సొంత వైద్యం కాకుండా ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించి చికిత్స అందించాలి.
- ముఖ్యంగా వేసవిలో సాధ్యమైనంత వరకు సులువుగా జీర్ణమైయ్యే ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి.

గతంలో ఘటనలు

కొత్తూరు మండలంలోని కొడిచర్ల పంచాయతీ ఖాజీగూడతండాలో 2014లో పెద్ద విషాదం చోటు చేసుకుంది. వేసవి సెలవుల్లో భాగంగా ప్రభుత్వ హస్టళ్లలో చదువుతున్న తండాకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఇళ్లకు వచ్చారు. వారు ఈత కోసం సమీపంలోని చెరువులోకి వెళ్లి అందులో పడి మృతి చెందారు. ఇన్ముల్‌నర్వ గ్రామ సమీపంలోని జేపీ దర్గా ఆవరణలో ఉన్న పీరం చెరువులో సైతం దర్గా దర్శనం కోసం వచ్చిన పలువురు విద్యార్థులు ఈత కోసం దిగి మునిగి మృతి చెందారు. సిద్ధాపూర్‌లోని క్రషర్ ప్లాంట్ల కోసం తవ్విన గుంతల్లో ఈత కోసం దిగి పలువురు మృత్యువాత పడ్డారు.